
శ్రీశైలంలో కిక్కిరిసిన భక్తజనం

# శివపూజకు వేళాయే..

- నేడు మహాశివరాత్రి
- ముస్తాబైన శైవ క్షేత్రాలు
- ఉమ్మడి జిల్లాలో మార్మోగనున్న శివనామస్మరణ
- ఉపవాస దీక్షలు ఆచరించనున్న భక్తులు
- విద్యుద్దీప కాంతుల్లో ఆలయాల ముస్తాబు

నేటి మహాశివరాత్రి వేడుకలకు ఉమ్మడి జిల్లాలోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. విద్యుద్దీప కాంతుల్లో మిరిమిట్లు గొల్పుతున్నాయి. బుధవారం శివనామస్మరణమార్మోగనుండగా.. భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టనున్నారు. శ్రీశైలం క్షేత్రం జనంతో కిక్కిరిసిపోయింది. హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.


అయిజలో బీఆర్ఎస్ ముఖ్య నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

## బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యం

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి
- మండల, పట్టణ కమిటీల ఎంపికకు కార్యాచరణ ప్రణాళిక
- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- అయిజ పట్టణ, మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం


అయిజ, ఫిబ్రవరి 25 : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముఖ్య నేతలు, కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఉందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మంగళవారం అయిజ పట్టణంలోని మాజీ జెడ్పీటీసీ పుష్పానర్సింహారెడ్డి స్వగృహంలో బీఆర్ఎస్ పట్టణ, మండల ముఖ్య నాయకులతో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్య నాయకులు కార్యకర్తలను కలుపుకొని పల్లెలు, పట్టణంలో బీఆర్ఎస్‌ను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. కలిసికట్టుగా పార్టీని పటిష్టం చేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎక్కడికక్కడే ఎండగట్టాలని సూచించారు. ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలుపునకు అహర్నిశలు కష్టపడాలన్నారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహానికి గురికాకుండా పార్టీ పటిష్టతపై దృష్టి సారించాలన్నారు. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా నిలుస్తామన్నారు. కార్యకర్తల మనోభీష్టానికి పెద్దపీట వేస్తూ పార్టీని నలుదిశలా వ్యాపింపజేయాలని కోరారు. త్వరలోనే మండల, పట్టణ నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందరి ఆమోదయోగ్యంగానే కమిటీల ఎంపిక ఉంటుందన్నారు. కమిటీల ఎంపికకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్సీ వెల్లడించారు. సమావేశంలో మాజీ ఎంపీపీలు సుందర్‌రాజు, సీతారాంరెడ్డి, మండల ఇన్‌చార్జి రంగారెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య, నాయకులు నర్సింహారెడ్డి, సత్యారెడ్డి, హన్మంతురెడ్డి, రవిరెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భవిష్యత్ బీఆర్ఎస్‌దే..


కార్యకర్తలతో ముచ్చటిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- కార్యకర్తలతో సరదాగా గడిపిన మాజీ ఎమ్మెల్యే

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 25 : భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్య పడవద్దని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం ఆయన పెద్ద కొత్తపల్లి మండల కేంద్రంలో కార్యకర్తలతో సరదాగా గడిపారు. అయితే కొల్లాపూర్ ప్రాంతంలో దాడులు పెరిగాయని, నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని మండల నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే బీరం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి చేయలేక కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమాలకు కోతలు పెడుతున్నదని ఆరోపించారు. ముఖ్యంగా ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తుందని, అంత మాత్రానా ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని అంత వరకు ఓపిక పట్టాలన్నారు. అనంతరం కార్యకర్తలు, నాయకులను సీరియస్ మూడ్ నుంచి బయటకు తీసుకొని వచ్చేందుకు వారితో కలిసి కొద్దిదూరం నడుచుకుంటూ వచ్చి ఓ టీస్టాల్ వద్ద అందరితో కలిసి టీ తాగి కాసేపు సరదాగా ముచ్చటించారు. మాజీ ఎమ్మెల్యే ఎక్కువ సమయం కార్యకర్తలు, నాయకులు కలిసి ఉండడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.


కాలిపోయిన వేరుశనగను కుప్పనుంచి వేరు చేస్తున్న మహిళా రైతు

## 200 బస్తాల వేరుశనగ దగ్ధం

- తిమ్మినోనిపల్లిలో రూ.5 లక్షల మేర నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకోలు

వెల్దండ, ఫిబ్రవరి 25 : ఆరుగాలం కష్టపడి పండించిన వేరుశనగ పంట అగ్నికి ఆహుతైన ఘటన మండలంలోని తిమ్మినోనిపల్లిలో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామస్తుల వివరాల ప్రకారం తోడేటి లక్ష్మారెడ్డి అనే రైతు తను పండించిన వేరుశనగ పంటను తీయించి మిషన్ ద్వారా పట్టించి మార్కెట్‌కు తీసుకుపోవడానికి కుప్పలుగా పోసి ఉంచాడు. అయితే మంగళవారం మధ్యాహ్నం షాక్‌సర్క్యూట్‌తో మిరుగులు పడడంతో కుప్పగా వేరుశనగకు నిప్పంటుకుంది. అక్కడే ఉన్న రైతు లక్ష్మారెడ్డి భార్య విషయాన్ని గుర్తించి వెంటనే భర్తకు చెప్పగా చుట్టుపక్కల రైతులతో కలిసి మంటలార్పగా అప్పటికే దాదాపు 200 బస్తాల వేరుశనగ కాలి బూడిదై రూ.5లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. దీంతో సదరు రైతు దంపతులు లబోదిబోమంటు గుండెలు బాదుకుంటున్నారు. ఒక్కపూట గడిస్తే పంట మొత్తం మార్కెట్‌కు తీసుకుపోయేవాడినని ఇంతలోనే పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనకు ఆర్థికసాయం చేయాలని రైతు వేడుకుంటున్నాడు. బాధిత రైతును నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- సొరంగంలోకి ర్యాట్ హోల్ మైనర్ టీం
- ఆక్సిజన్ మాస్కులతో నేవీ టీం
- టీబీఎం మిషన్ అవతల ఐదు మీటర్ల వరకు పేరుకుపోయిన బురద
- కష్టంగా మారిన రెస్క్యూ ఆపరేషన్
- ప్రత్యామ్నాయ మార్గాల వైపు సర్కారు యోచన


ఎస్ఎల్బీసీ వద్ద సహాయక చర్యల్లో నిమగ్నమైన బృందాలు

# 96 గంటలు.. ఎదురుచూపులు..

మహబూబ్‌నగర్ (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ దోమలపెంట, ఫిబ్రవరి 25 : నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న వారి కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ప్రమాదం జరిగిన సొరంగంలోని 14వ కిలోమీటర్ సమీపంలో 40 మీటర్ల దగ్గరే ఆగిపోతుండడంతో రెస్క్యూ ఆపరేషన్ సవాల్‌గా మారింది. దేశంలోని అత్యుత్తమ(11) బృందాలు గాలిస్తున్నా ఇంకా ఫలితం కనుచూపు మేరలో కనిపించడం లేదు. దీంతో మంగళవారం సహాయక చర్యల్లో పాల్గొన్న బృందాలు వెనక్కి వచ్చాయి. ఉత్తరాఖండ్‌కు చెందిన ర్యాట్ హోల్ మైనర్ టీంను రంగంలోకి దింపారు. ఈ టీంతో పాటు భారత నేవీ దళానికి చెందిన ప్రత్యేక బృందం కూడా ఉంది. వీరితోపాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌కు చెందిన బృందాలు కూడా గాలించడానికి సొరంగంలోకి వెళ్లాయి. పోలీస్ జాగిలాలను కూడా పంపించారు. ఉదయం 10 గంటలకు లోకో ట్రైన్ ద్వారా టన్నెల్ లోపలికి వెళ్లిన ఈ బృందాలు సాయంత్రం 7 గంటలకు తిరిగి వచ్చాయి. అయితే అక్కడ ప్రతికూల పరిస్థితులు ఉన్నందువల్ల రెస్క్యూ ఆపరేషన్ కష్టసాధ్యంగా మారిందని వెల్లడించారు. సహాయక చర్యలకు ఏమాత్రం అనువుగా లేవని ప్రకటించారు. అంతకు ముందు రాష్ట్ర విపత్తు నిర్వహణ సెక్రటరీ అరవింద్ కుమార్ ప్రభుత్వంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం వీరిని లోపలికి పంపించారు. ప్రమాదం జరిగిన చోట నీటిఊట మరింత పెరిగిందని నిమిషానికి 5,000 లీటర్ల నీరు ఉబికి వస్తుందని గుర్తించారు. రెండ్రోజుల కన్నా ఇప్పుడు మరింత పెరిగిందని గుర్తించారు. 8 మంది చిక్కుకున్న ప్రదేశంలో సుమారు 5 మీటర్ల బురద ఉందని అంచనా వేశారు. ఈ బురదలో కాళ్లు పెడితే లోపలికి జారే అవకాశం ఉన్నందునా రెస్క్యూ టీం అడుగు ముందుకు వేయలేదు. సొరంగంలోపల విద్యుత్ పునరుద్ధరించే అవకాశాలు లేక పోవడంతో వెంట జనరేటర్లను, టార్చ్ లైట్లను తీసుకువెళ్లారు. ప్రమాదం జరిగిన చోటు గుర్తించి అక్కడ శిథిలాల తొలగింపు పూర్తయితే తప్పా పరిస్థితి ఏమిటన్నది అంచనా వేయలేమని రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహిస్తున్న బృందం సభ్యులు అంటున్నారు. ఎస్ఎల్బీసీ ప్రమాద సంఘటన స్థలాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ సందర్శించారు. అనంతరం బేస్ క్యాంపులో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి సహాయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణా శాఖ స్పెషల్ సీఎస్ అర్వింద్ కుమార్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, కలెక్టర్ బాదావత్ సంతోష్, ఐజీ చౌహాన్, టన్నెల్ రంగ నిపుణులు క్రిస్ కూపర్, రాబిన్స్ కంపెనీ ప్రతినిధి గ్రేన్ మేకర్డ్, ఉత్తరాఖండ్‌లో ఇలాంటి దుర్ఘటనలో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించిన నిపుణుల బృందం, ఆర్మీ, నేవీ అధికారులు పాల్గొన్నారు.

### జలరాశితోనే సొరంగంలోకి నీళ్లు

సొరంగంలో నీటి ఊటకి సంబంధించి నేషనల్ జియోగ్రాఫిక్ సర్వే ఏజెన్సీ క్షుణ్ణంగా లోపలికి వెళ్లి పరిశీలించింది. అంతేకాకుండా 14వ కిలోమీటర్ల వద్ద ఉన్న గుట్టను పూర్తిగా పరిశీలించారు. పై భాగంలో పెద్ద ఎత్తున జలరాశి ఉన్నదని, దీంతో సొరంగంలోకి నీళ్లు ప్రవేశిస్తున్నాయని తేల్చారు. పైనుంచి ఏ మాత్రం సొరంగంలోకి వెళ్లే అవకాశం లేదని.. అలా అయితే సొరంగం మొత్తం కుప్పకూలే అవకాశం ఉందని నివేదిక ఇచ్చారు. సొరంగంలోపల కూడా చుట్టుపక్కల లైనింగ్ నుంచి కూడా నీటి ధార వస్తోందని.. ఇది కూడా సొరంగానికి ప్రమాదకర స్థాయిలోనే ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ఎట్టి పరిస్థితుల్లో ముందుకు వెళ్లడానికి అవకాశం లేకుండా పోయిందని చెబుతున్నారు.


### రేపు దోమలపెంటకు మాజీ మంత్రి హరీశ్‌రావు..

- ఘటనా స్థలాన్ని పరిశీలించనున్న బీఆర్ఎస్ బృందం

దోమలపెంట, ఫిబ్రవరి 25 : దోమలపెంట వద్ద ఎస్ఎల్బీసీ టన్నెల్లో జరిగిన ప్రమాదంలో 8 మంది చిక్కుకున్న ఘటనా స్థలానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్ఎస్ బృందం రానుంది. గురువారం అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు గువ్వల బాలరాజ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి హరీశ్‌రావు బృందం దోమలపెంటకు చేరుకుంటున్నారు. అంతకు ముందు అచ్చంపేట నియోజకవర్గంలోని హాజీపూర్ వద్ద ఎస్ఎల్బీసీ టన్నెలును సందర్శించనున్నది. అనంతరం అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను అడిగి తెలుసుకుంటారు. ఆ తర్వాత లోపల చిక్కుకున్న బాధిత కుటుంబాలతో మాట్లాడనున్నారు.

### దోమలపెంటకు చేరిన బాధిత కుటుంబీకులు

దోమలపెంట వద్ద ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న నలుగురు కార్మికుల బంధువులను అక్కడి ప్రభుత్వం నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంటకు పంపించింది. జార్ఖండ్‌కు చెందిన మైనింగ్ ఆఫీసర్ అవినాశ్ వెంట ఇక్కడికి చేరుకున్నారు. ఈ బృందం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్‌ను కలిసింది. సొరంగంలో జరుగుతున్న సహాయక చర్యలను కార్మికుల బంధువులకు వివరించింది. నాలుగు రోజులుగా జరుగుతున్న రెస్క్యూ ఆపరేషన్‌ను బంధువులకు వివరించారు. ప్రమాదానికి ఒక రోజు ముందే కుటుంబ సభ్యులతో మాట్లాడినట్టు జార్ఖండ్ మైనింగ్ ఆఫీసర్ అవినాశ్ తెలిపారు.


ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న వారి బంధువులు


మక్తల్ మండలం పసుపుల వద్ద ఎగువ నుంచి కృష్ణానదికి వస్తున్న వరద

## కృష్ణానదికి స్వల్ప వరద

మక్తల్, ఫిబ్రవరి 25 : కృష్ణానదికి ఎగువ ప్రాంతం నుంచి స్వల్పంగా వరద కొనసాగుతున్నది. నదీ తీర ప్రాంతంలో వరిపంట సాగు చేసిన రైతన్నల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని మంత్రి జూపల్లి కృష్ణారావు, మక్తల్, గద్వాల, దేవరకద్ర ఎమ్మెల్యేలు 15 రోజుల కిందట కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసి తెలంగాణలో నదీ తీర ప్రాంతాల్లో వేసిన పంటలను కాపాడుకునేందుకు కృష్ణానదికి నీటిని విడుదల చేయాలని కోరారు. కర్ణాటక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం విన్నపం మేరకు నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసింది. మంగళవారం ఉదయం నాటికి జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరదతో 2800 క్యూసెక్కులు జూరాల ప్రాజెక్టుకు చేరిందని భీమా ప్రాజెక్టు డీఈ వెంకటరమణ తెలిపారు. కర్ణాటక ప్రాంతం నుంచి దిగువకు నీరు విడుదల చేయడం వల్ల నదీతీర ప్రాంతంలోని వేల ఎకరాల్లో వరి పంటకు సాగునీరు పుష్కలంగా అందుతుందని ఆయన పేర్కొన్నారు.

### నీటిని విడుదల చేసిన అధికారులు..

కృష్ణానదికి ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నేపథ్యంలో మక్తల్ మండలం చిన్న గోపులాపూర్‌లోని భీమా ఫేజ్-1లో అంతర్భాగమైన చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, భూత్పూర్ రిజర్వాయర్లకు నీటిని తరలించేందుకు మండలంలోని చిన్నగోపులాపూర్ స్టేజ్-1 నుంచి 650 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసేందుకు ఒక మోటర్‌ను అధికారులు ప్రారంభించారు. 650 క్యూసెక్కుల నీటిలో 250 క్యూసెక్కుల నీరు రిజర్వాయరుకు, 400 క్యూసెక్కుల నీరు మక్తల్ తిరుమలాయ చెరువు కట్ట వద్ద ఉన్న స్టేజ్-2 పంప్‌హౌస్ నుంచి చిట్టెం నర్సిరెడ్డి రిజర్వాయర్‌కి నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులతో పాటు మాజీ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## జనరేటర్ ఫ్యాన్‌లో చీర చిక్కుకొని మహిళ మృతి

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 25 : ప్రమాదవశాత్తు జనరేటర్ ఫ్యాన్‌లో చీర చిక్కుకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం ఉప్పునుంతల మండలం పూరియానాయక్‌తండాలో మంగళవారం చోటు చేసుకున్నది. స్థానిక ఎస్సై కథనం ప్రకారం పూరియానాయక్ తండాకు చెందిన జరుపుల వెంకట్రాం భార్య బుజ్జి (38) కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం మండలంలోని ఈరట్వానిపల్లి గ్రామానికి వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. సోమవారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో పెళ్లి ఊరేగింపులో జరుపుల బుజ్జి ఊరేగింపు చూస్తుండగా ప్రమాదవశాత్తు డీజే పక్కన ఉన్న జనరేటర్ ఫ్యాన్‌లో ఆమె చీర చిక్కుకొని తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వెంటనే యెన్నం దవాఖానకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలిస్తుండగా మంగళవారం ఉదయం మార్గమధ్యంలో మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వేరుశనగ@రూ.7,929

జడ్చర్ల, ఫిబ్రవరి 25 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో వేరుశగకు అత్యధికంగా 7,929 ధర పలికింది. మంగళవారం బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు 2,568క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.7,929 ధర రాగా కనిష్ఠంగా రూ.4,100, మధ్యస్తంగా రూ.6,680 ధర పలికింది. అదేవిధంగా 77క్వింటాళ్ల కందులు అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.6,940 ధర రాగా కనిష్ఠంగా రూ.4,100, మధ్యస్తంగా రూ.6,680 ధర పలికింది.

## శ్రీశైల దేవస్థానం, శ్రీశైలం - 2025, మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు

SRISAILA DEVASTHANAM

ప్రకటన

ముఖ్యకార్యక్రమాలు

| | | |
|---|---|---|
| 26.02.2025 మహాశివరాత్రి | సాయంత్రం: 5.30 గం॥లకు | ప్రభోత్సవం |
| | రాత్రి: 7.00 గం॥లకు | నంది వాహనసేవ |
| | రాత్రి: 10.00 గం॥ల నుండి | శ్రీ స్వామి వారికి లింగోద్భవకాల మహాన్యాసపూర్వ ఏకాదశ రుద్రాభిషేకం, పాగాలంకరణ |
| | రాత్రి: 12.00 గం॥లకు | శ్రీ స్వామి అమ్మవార్ల దివ్య కల్యాణమహోత్సవం |
| 27.02.2025 | సాయంత్రం: 5.00 గం॥లకు | రథోత్సవం |
| | రాత్రి: 8.00 గం॥లకు | తెప్పోత్సవం |
| 28.02.2025 | ఉదయం: 08.10 గం॥లకు | పూర్ణాహుతి, కలశోద్వాసన, అవబృథం,వసంతోత్సవం, త్రిశూలస్నానం |
| | సాయంత్రం: 6.00 గం॥లకు | సదస్యం, నాగవల్లి, ఆస్థానసేవ |
| | రాత్రి: 7.30 గం॥లకు | ధ్వజావరోహణ |
| 01.03.2025 | రాత్రి: 7.30 గం॥లకు | అశ్వవాహన సేవ |
| | రాత్రి: 8.30 గం॥లకు | పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంత సేవ |

శ్రీశైల పరోక్ష సేవ

శ్రీశైలానికి స్వయంగా విచ్చేయని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం పరోక్ష సేవలను నిర్వహిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా పూజ రుసుము చెల్లించి భక్తులు తమ గోత్రనామాలతో ఆయా పూజాదికాలను జరిపించుకోవచ్చు.

ఉదయాస్తమాన సేవ

ఆలయములో ఒక రోజు జరిపే సేవలన్నింటిలోనూ అనగా ప్రాతకాలములో ఆలయద్వారాలు తెరిచినది మొదలు తిరిగి రాత్రి ఆలయద్వారాలు మూసేంతవరకు, సుప్రభాతం నుండి ఏకాంత సేవ వరకు మొత్తం 14 సేవలలో భక్తులు పాల్గొనవచ్చు. సేవా రుసుము : 1,01,116/-

ప్రదోషకాలసేవ

ప్రదోషకాలంలో (సాయంత్రం) ఆలయములో నిర్వహించే మహామంగళహారతి, పంచామృత అభిషేకం, కుంకుమార్చనలను భక్తులు జరిపించుకోవచ్చు. సేవా రుసుము : 25,116/-

ఇతర వివరాలకు సందర్శించండి: www.srisailadevasthanam.org లేదా aptemples.ap.gov.in

శ్రీ స్వామి అమ్మవారి సేవలో
యం.శ్రీనివాస రావు ఎం.ఏ., ఎం.ఈడి.,
కార్యనిర్వహణాధికారి